బయటుపడసాగింది. నవ్యత, నాగరికత వాళ్ళ వేషభాషల్లో నేకాని ప్రవర్తనలో కాదని ఋజువు కాసాగింది. ఆధునిక విజ్ఞానం, హైయ్యర్ ఎడ్యుకేషన్ వాళ్ళ గుణగణాలలో ఏమాత్రం మార్పు తీసుకరాలేదని అతడు మెల్లమెల్లగా గ్రహించసాగాడు. సమతానగర్ అన్న పేరు ఆ కాలనీకి మేడిపండులాంటిది మాత్రమేనని గ్రహించడానికి సుధాకర్‌కు ఎక్కువ కాలం పట్టలేదు. అయినా సుధాకర్ నిరాశజెందలేదు. ఆ కాలనీలోకి యువకులలో శాస్త్రీయ దృక్పథం కలుగజేయడానికై తీవ్ర ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు.

# 12. రెడ్డిగారి వివాహ ప్రహసనం

మొదటినుంచీ రెడ్డిగారు అదో తరహా మనిషి. ప్రతి విషయాన్నిగూర్చి ధారాళంగా ఉపన్యసించేవారు. కాని ఏదీ చేసేవాడుకాదు. భారతదేశంలో ముష్టివాళ్ళు, పేదవాళ్ళు చాలామంది ఉన్నారు. వాళ్ళ పరిస్థితి అధ్వాన్నంగా ఉందని లెక్చరిచ్చేవాడు. కాని వీధిలో బిచ్చగాడెదురైతే ఒక్కపైసా కూడ దానంచేసేవాడు కాదు. సినిమాల్లో శృంగారం తెగ చూపిస్తున్నారని సినిమావాళ్ళను తెగతిట్టేవాడు. కాని జయమాలిని లేని సినిమాకు ససేమిరా పోయేవాడుకాదు. వారు ఏపార్టీకి చెందినవారో తెలిసికోవడం బ్రహ్మాతరంకూడకాదు. ఆర్. ఎస్. ఎస్. వాళ్ళతో స్వయంసేవక్‌ననీ, కాంగ్రెస్‌వాళ్ళ

తో పక్కా కాంగ్రెస్‌వాదిననీ, కమ్యూనిస్టులతో కమ్యూనిస్టు ననీ చెప్పుకుంటాడు. ఒక్కొక్కరిముందర ఇతర పార్టీలను దుమ్మెత్తి పోస్తాడు. వ్యభిచారంగూర్చి బాగానే తిడ్తాడు. కాని ఏదో ఒక సాకుతో విజయవాడకు పోకుండా ఉండలేడు. వరకట్నం మాచెడ్డ దురాచారమనీ, దాన్ని తప్పకుండా రూపుమాపాలనీ, అందుకై తమలాంటి విద్యాధికులైన యువ కులు ముందుకు రావాలనీ, చెప్పేవాడు. కాని తననెవరైనా కట్నం లేకుండా పెళ్ళిచేసుకోమంటే నసిగేవాడు.

రెడ్డిగారికి రమ అనే మేనమామ కూతురుండేది. ఆమె పెద్ద అందగత్తె కాకపోయినా కురూపిమాత్రం కాదు. చదు వుకునే రోజుల్లో సెలవులున్నపుడు ఆమె వీళ్ళింటికిగాని, ఈ యన వాళ్ళింటికిగాని పోయేవారు. కలిసి ఆడుతూ పాడు కునేవారు. లేత వయస్సులోనే ఒకరంటే ఒకరికి మక్కువ ఏర్పడింది. యవ్వన మంకురార్పణమయే వయస్సులో అది కాస్త ప్రేమగా మారింది. గ్రాంధికంగా చెప్పాలంటే వాళ్ళు పరస్పరం గాఢంగా ప్రేమించుకున్నారని చెప్పవచ్చు.

రెడ్డి పి. యు. సి. చదివే రోజులలో సౌమ్యతో పరిచయ మేర్పడింది. సౌమ్య దాదాపు రమ వయస్సుదే. రెడ్డిగారి ప్రక్క యింట్లో వాళ్ళుండేవారు. రెడ్డి చెల్లెలుకోరకై ఆమె వాళ్ళింటికి వచ్చేది. రెడ్డి వాక్చాతుర్యాన్ని చూసి సౌమ్య ముగ్ధురాలయ్యేది. రెడ్డి చెల్లెలింట్లో లేనపుడు సౌమ్య వస్తే దగ్గరకు పిలుచుకునేవాడు. మాటలతో మురిపించేవాడు.

ముద్దుకూడ పెట్టుకునేవాడు. అమాయకురాలైన సౌమ్య ఇవేమీ పట్టించుకునేదికాదు. స్వతహాగా అందగత్తె అయిన సౌమ్య వయసువచ్చేకొలది చూపరుల కండ్లకు మిరుమిట్లు గొల్పేది పౌరాణిక భాషలో చెప్పాలంటే అమె అందం ఎందు రంభకూడ దిగదుడుపే. సౌమ్యను చూస్తున్నకొలది రెడ్డిగారి మనస్సు మనస్సులో ఉండేదికాదు. కాని అతనికి చిన్నప్పటినుంచి రమ అంటే చాలా యిష్టం. ఈలోగా రెడ్డి తల్లి దండ్రులు సౌమ్యను రెడ్డికి చేసుకుంటే బాగుంటుందని, కట్నంకూడా రమకంటే ఎక్కువగా యిస్తారని అనుకోగా విన్నాడు. కండ్లు మిరుమిట్లు గొలిపే సౌమ్య అందంముందు రమ జ్ఞాపకాలు తుడుచుకుపోసాగాయి. రమవాళ్లు మహా యిస్తే ఇరువై వేలిస్తారు. కాని సౌమ్యవాళ్ళు నలభై వేలైనా యిస్తారు. రెడ్డి తన మనస్సును క్రమక్రమంగా సౌమ్యవైపు మరల్చాడు. సౌమ్యతో స్నేహం వృద్ధిచేసుకొన్నాడు. ఈ లోగా రెడ్డి గ్రాడ్యుయేషన్ పూర్తయింది. సౌమ్య ఇప్పుడు వయస్సులో ఉన్నందున దగ్గరకు తీసుకుంటే పోయేదికాదు. అయినా అతడామెను మాటలతో మురిపిస్తూ తన కామె కాబోయే భార్యయని, భయపడకూడదని, దగ్గరకు తీసుకొనే వాడు. కాని ఎంత ప్రయత్నించినా అమె కాలుజారేంత చనువుమాత్రం మివ్వలేదు. ఆ కాలంతో అనగా తాను నిరుద్యోగిగా, గ్రాడ్యుయేటుగా ఉన్నపుడు తాను సౌమ్యను పెళ్లాడ్డం మహాదృష్టంగా భావించేవాడు. సౌమ్య విషయం తెలిసికొన్న

రమ రెడ్డిని నిలదీసి అడుగగా తన తల్లిదండ్రులకు రమపై ఇష్టం లేదనీ, ఏమేమో బొంకి ఆమెను తనపై ఆశ వదలుకొమ్మని సలహా ఇచ్చాడు. సౌమ్యతో తన సంసార జీవితాన్ని ఊహించుకుంటూ మధుర స్వప్నాలు గాంచేవాడు రెడ్డి.

ఈమధ్యనే రెడ్డిగారికి కేంద్ర ప్రభుత్వ యాజమాన్యం క్రింద పనిచేసే ఒక మాదొడ్డ కంపెనీలో 7, 8 వందల జీతంతో ఉద్యోగం లభించింది. రెడ్డిగారు తన జీతం త్వరలో నాలుగంకెలకు చేరుతుందని కలలు గనేవాడు. తన ఉద్యోగంలో ప్రమోషన్ స్కోప్స్ బాగా ఉన్నవని చెప్పుకొనేవాడు. రెడ్డి ఉద్యోగం దొరికిన తర్వాత మ్యారేజీ మార్కెట్‌లో వ్యాల్యూ చాలా పెరిగింది. చాలా సంబంధాలు ఒకరు యాభై వేలిస్తామనీ, వేరొకరు అరవై వేలిస్తామనీ రాసాగారు. అపుడు రెడ్డిగారికి ఉన విలువేందో తెలిసొచ్చింది. ఇన్నిరోజులు తానేమో అనుకొన్నాడు కాని తనకు బాగా విలువున్నట్టు ఋజువయ్యింది. ఇపుడు రెడ్డి మాచెడ్డ డైలయాల్లో పడ్డాడు. తాను సౌమ్యను పెండ్లాడడమా? లేక కొత్త సంబంధాల నొప్పుకోవడమా. సౌమ్యను పెండ్లాడితే కేవలం నలభై వేలిస్తారు. వేరే సంబంధమైతే చెప్పాలేట్‌పోను కనీసం డెబ్బైవేలైనా వస్తాయి. కాని సౌమ్య మహా అందగత్తె. పైగా తాను ప్రేమించాడు. కాని ఇపుడు తన పొజిషన్ పెరిగింది. తనకు కనీసం స్కూటర్ లేందేం బాగుండదు. సౌమ్యను పెళ్లాడితే తనకీ లాంచనాలేవీ జరుగవు. సౌమ్యను ప్రేమిస్తున్న దామె

అందాన్ని చూసేకదా! అతని మస్తిష్కంలోకి మెరుపులాంటి ఐడియా వచ్చింది. సౌమ్యలాంటి అందగత్తె మరియు తన పొజిషన్‌కు తగినట్లు స్కూటర్ మరియు కట్నంతో వస్తే పెళ్ళిచేసుకోవాలనుకొన్నాడు. చాకులాంటి తన ఐడియాకు తనకుతానే అభినందించుకొన్నాడు. కాని సౌమ్యకేమని చెప్పాలి? అందరూ ఉపయోగించే ఆయుధం ఉందిగా. తల్లి దండ్రులకి ఎక్కువ కట్నం కావాలి. అందువల్ల తనకిష్టమున్నా వాళ్ళమాటలను కాదనలేననీ చెప్పాలనుకొన్నాడు. అదే చెప్పేసాడు. దినదినానికి సంబంధాలు పెరిగిపోతున్నాయి. నెలకో సంబంధం చొప్పున నాలుగేళ్ళవరకు వెదికాడు. కాని అతననుకొన్నట్లు సౌమ్యలాంటి అందగత్తె, తాను కోరినంత కట్నంతో ఎక్కడా లభించలేదు. రెడ్డిగారికేంచేయాలో తోచిచావడంలేదు.

ఇంతలో వరంగల్‌నుంచి ఒక సంబంధం వచ్చింది. ఎనభై వేల కట్నం, ఒక జావా ఇస్తామన్నారు. అమ్మాయి సౌమ్యలా లేకున్నా బాగానే ఉంది. పైగా కట్నంకూడ బాగానే ఉంది. ఒప్పుకున్నాడు. వరపూజ ఇంకా నెలరోజులకున్నది. ఈలోగా హైదరాబాదునుండి మరో సంబంధం వచ్చింది. వాళ్లు లక్షరూపాయల కట్నమిస్తూ, వెహికిల్ మరియు ఇతర లాంచనాలు ఇస్తామన్నారు. రెడ్డిగారి గుండె గుభేలుమన్నది. లక్షరూపాయల కట్నం మరియు యితర లాంచనాలు కలుపుకుంటే లక్షా పాతిక వేలౌతుంది. తానెన్ని

రోజులు ఉద్యోగం చేస్తే మాత్రం అంత డబ్బు సంపాదించ గలడు? ఆ సంబంధం తన పొజిషన్‌కు అన్ని విధాల తగిన ట్లుంది. పైగా తన తోడి అల్లుళ్ళిద్దరూ అమెరికాలో ఉన్నారు. అమ్మాయి తండ్రికి మగపిల్లలులేరు. తరువాత ఆ ఆస్తిని కూడ కాజెయ్యొచ్చు. పోగా ఆ అమ్మాయికి తక్కువున్న దేమిటి? అందం- అందమేమున్నా కొరుక్కుతినేదా? **When the candles are out all women are beautiful**, అన్న సామెత రెడ్డిగారికా సమయంలో గుర్తుకొచ్చింది. టకీమని ఆ సంబంధాన్ని ఒప్పుకున్నాడు. పెళ్ళికూడా చేసుకున్నాడు.

అమెరికా డాలర్లతో మామగారు కొనిచ్చిన సరికొత్త స్కూటర్‌పై భార్య నెక్కించుకొని భలే హుషారుగా తిరిగే వాడు రెడ్డిగారు. త్వరలో తన జీతం నాలుగంకెలకు పెరుగు తుందనీ, తనది చాలా మంచి స్కోప్స్‌గల ఉద్యోగమనీ భార్యతో చెప్పేవాడు. ప్రపంచంలో ఆనందమంతా తమదే అన్నట్లు అనుభవించారు వాళ్ళిద్దరూ కొన్నాళ్ళు. క్రమక్ర మంగా రోజులు గడుస్తున్నకొద్దీ రెడ్డిగారి భార్యకు తనను తన అక్కలతో పోల్చుకుంటే తన భర్త ఉద్యోగం చాల చిన్న దిగా తోచేది. అందుకొరకు దిక్కుమాలిన ఉదోగం, పాడు ఉద్యోగమని తిట్టేది. ఆమె కోరినది ఏకారణం వల్లనైనా తేకుంటే దిక్కుమాలిన సంబంధమనీ, తన అక్కలు అమెరి కాలో భలే సుఖపడుతున్నారనీ, తలరాతకొద్దీ తనకీ పాడు

సంబంధం దొరికిందనీ వాపోయ్యేది. పైగా నాలుగంకెల జీతంతో రావాలనుకొన్న ప్రమోషన్ ఎన్నాళ్ళకైనా రాక పోవడంకూడ ఆమె నణగడానికొక కారణమైంది. రెడ్డిగారు "డ్యూటికి ఆలస్యమవుతుంది వంట త్వరగా కానీయమంటే" దరిద్రపు సంసారం ఒక్కపనిమనిషైనాలేదు. లక్షల కట్నం తెచ్చిన నాకు వంట తప్పలేదు. మా అక్కలే అదృష్టవం తులు" అని గొణిగేది. మొదట గొణిగినట్లు మాట్లాడినా క్రమ క్రమంగా ఎదిరిస్తూ మాటకు మాటనేది. ఇరుగుపొరుగువారు వింటున్నారన్న జ్ఞానంకూడ లేకుండా ఒకరిపై ఒకరు కేక లేసుకునేవారు. బయట వాళ్ళ సంసారం నవ్వులపాలైంది. పైగా కట్నానికి ఆశపడి తాను అందంలేకున్నా, ఆమెను పెళ్ళాడినాడని స్నేహితులంతా అవకాశం దొరికినపుడల్లా ఏడిపిస్తారు.

రెడ్డిగారి వివాహ జీవిత మొక ప్రహసనంలా తయా రయింది. మనశ్శాంతి కరువై జీవచ్ఛవంలా కాపురం చేస్తు న్నాడు. తన జీవితమిలా నవ్వులపాలౌతుందని తెలిసికుంటే తాను, సౌమ్యనో- రమనో పెళ్ళాడేవాడిననీ వాపోతాడు. సుఖంగా కాపురాలు చేసుకుంటున్న రమ, సౌమ్య సంసా రాలను తలుస్తూ దుఃఖిస్తాడు. కట్నంకొరకు నాటకాలాడిన రెడ్డికి తగిన శాస్తే జరిగిందని లోలోన సంతోషపడుతూ పైకి సానుభూతి ప్రకటిస్తూ, చాటుగా నవ్వుకుంటారు రెడ్డి స్నేహితులు. కట్నంకొరకు ఆడవాళ్ళ జీవితాలతో ఆటలాడు

కొంటున్న యీ పుణ్యభూమిలో రెడ్డికి జరిగిన శాస్తి అందరికీ జరిగితే ఎంత బాగుంటుంది?

హెచ్చరిక:- యువకులారా! కట్నంకొరకు వ్యక్తిత్వాలను చంపుకొని అమ్ముడుపోకండి.

(అన్నపూర్ణ - జులై, డిసంబర్ 81)

---

# 13. బ్రతుక నేర్చినవాడు

చంద్రశేఖర్ మంచివాడు. చాలచాల మంచివాడు. ఎంత మంచివాడంటే నొసటిపై కుంకుమబొట్టు ఇరువైనాల్గు గంటలూ నలగకుండా ఉంచుకొంటాడు. డ్యూటీలో ఉన్నపుడు పనిచేసే చెమటతో బొట్టుపోతుందేమోనన్న భయంతో మూతపై అద్దం అమర్చియున్న చిన్న కుంకుంభరిణి ఎప్పుడూ పాంటుజేబులో ఉంచుకొంటాడు. అతడు గొప్ప దైవభక్తుడాయె మరి, బొట్టు నలిగితే అపచారంకాదా? రోజూ ప్రొద్దున గంటసేపూ, సాయంత్రం గంటసేపూ హరినామస్మరణతోనే గడుపుతాడు. తనవెనుక ప్రొద్దునచేసిన పాపాలను క్షమించమని సాయంత్రం ప్రార్థనలో, చీకటి తప్పులేమైనా వుంటే క్షమించుమని ఉదయం దేవునిముందు సాష్టాంగపడి మొక్కుకుంటాడు. పక్కింటివాళ్ళకు వినవచ్చేట్టుగా లెంపలు వాయించుకొంటాడు. దేవుడు క్షమాగుణం కలవాడని అతని దృఢ నమ్మకం.

—కాలువ మల్లయ్య